సాక్షి
వైఎస్‌ఆర్ జిల్లా
బుధవారం । 27 । నవంబర్ । 2024



రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ
జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి ఆధ్వర్యంలో కడప జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులచేత రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. -8లో



రైస్ పుల్లింగ్ పేరుతో మోసం
ప్రొద్దుటూరు పట్టణంలో రైస్ పుల్లింగ్ పేరుతో తాజాగా ఓ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. చివరికి ఆ మోసగాళ్లు పోలీసులకు చిక్కారు. -8లో

గరిష్టం/కనిష్టం
28.4/20.9

వాతావరణం
జిల్లాలో మంగళవారం 20.9 - 28.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నాగనాథేశ్వరుని హుండీ ఆదాయం రూ 3,38,126

ఖాజీపేట: కార్తీక మాసంలో పెద్ద ఎత్తున భక్తులు ఖాజీపేట మండలం లోని నాగనాథేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నాలుగు వారాల పాటు భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారికి కానుకలు అర్పించారు. నాలుగు సోమవారాల కానుకలను దేవదాయ శాఖ అధికారులు లెక్కించారు. తొలి సోమవారం రూ. 38,350, రెండవ వారం రూ. 72,336, కార్తీక పౌర్ణమి రోజున రూ. 36,097, మూడవ వారం రూ. 1,01,790, నాల్గో వారం రూ. 89,553 .. మొత్తం రూ 3,38,126 వచ్చింది. ఈ డబ్బును బ్యాంకు లో జమ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

కడప క్రీడాకారిణికి ఫిడే రేటింగ్


అమీనా

కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన చదరంగం క్రీడాకారిణి అమీనా అంతర్జాతీయ ఫిడే రేటింగ్ సాధించింది. అండర్-9 విభాగానికి చెందిన అమీనా ఈయేడాది జూలైలో చెన్నైలోని రాయపేట రోటరీ క్లబ్‌లో నిర్వహించిన ఇంటర్నేషనల్ ఫిడే ర్యాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో రేటెడ్ క్రీడాకారుడిపై విజయం సాధించడంతో ఈమెకు ఫిడే ర్యాపిడ్ రేటింగ్ లభించింది. తాజాగా ఫిడే నవంబర్ నెలలో అమీనా రేటింగ్‌ను 1407గా ప్రకటించింది. ఈ సందర్భంగా జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి అనీస్‌దర్బారీ అభినందించారు.

ప్రభుత్వ పెన్షనర్స్‌కు శుభవార్త

కడప ఎడ్యుకేషన్: 135 నెలలు నిండిన పెన్షనర్స్ అందరి బేసిక్ పే నుండి కమ్యుటేషన్ (40%)మొత్తాన్ని కట్ చేయకుండా ప్రభుత్వం ఈ5/14021/2024మెమో విడుదల చేసిందని, తదుపరి ఉత్తర్వులు ఇచ్చేంత వరకు ఈ మెమో అమలులో ఉంటుందని కడప జిల్లా ప్రభుత్వ పెన్షనర్ల సంఘ అధ్యక్షులు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తి నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 135 నెలల పెన్షన్ కాలం ముగిసిన వారందరికీ ఈ మెమో వల్ల ఆర్థిక లాభం కలుగుతుందని తెలిపారు. కోర్టు ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకొని ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన మెమో ద్వారా రాష్ట్రం లోని అన్ని ట్రెజరీ కార్యాలయాలకు ఉత్తర్వులు ఇవ్వడంపై వారు హర్షం వ్యక్తం చేశారు. పెన్షనర్ల సంఘం ఉపాధ్యక్షులు నారాయణ, రాధాకృష్ణ, బాల ఎల్లారెడ్డి, కోశాధికారి నగేష్, సంఘ కార్యవర్గ సభ్యులు కూడా హర్షం వ్యక్తం చేశారు.

ప్రశాంతంగా ఎంపీహెచ్‌ఎస్ పదోన్నతుల కౌన్సెలింగ్


పదోన్నతుల కౌన్సెలింగ్ చేపడుతున్న రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య

కడప రూరల్: వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో మంగళవారం నిర్వహించిన ఎంపీహెచ్‌ఎస్‌ల పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాయలసీమ జిల్లాల వ్యాప్తంగా పనిచేస్తున్న మొత్తం 11 మంది ఎంపీహెచ్‌ఏ ఉద్యోగులకు ఎంపీహెచ్‌ఎస్‌గా పదోన్నతులు కల్పించారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య మాట్లాడుతూ ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిబంధనల ప్రకారం అర్హులైన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ గోపాల్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బత్తనయ్య తదితరులు పాల్గొన్నారు.


భూ సేకరణ పనులు పూర్తిచేయాలి

కడప సెవెన్‌రోడ్స్: జిల్లాలో చేపడుతున్న భూసేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాల క్లియరెన్స్ ప్రక్రియలను ఎలాంటి పెండింగ్ లేకుండా నిర్ణీత సమయంలోగా పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులకు సంబంధించి భూ సేకరణ తదితర అంశాలపై మంగళవారం కలెక్టరేట్ నుండి జేసీ అదితిసింగ్ ఎన్‌హెచ్‌ఏఐ అధికారులతో కలిసి కలెక్టర్ సంబంధిత తహశీల్దర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి 1094 హెక్టార్ల భూసేకరణ చేపట్టడం జరుగుతోందన్నారు. అందుకు సంబంధించి జిల్లా పరిధిలో ప్రభుత్వ, ప్రయివేటు, అటవీ శాఖకు చెందిన పలు భూములను కొనుగోలు చేసి.. భూములు కోల్పోయినవారికి పరిహారం కూడా ఇస్తామన్నారు. ఈ ప్రక్రియలో ఎదురయ్యే ఫారెస్ట్, పర్యావరణ అభ్యంతరాలు, సవాళ్లు, కోర్టు కేసులు సంబంధిత అంశాలను అధిగమించామన్నారు.

వరి రైతుకు వాయు గండం

- ఆందోళనలో అన్నదాతలు
- పలు చోట్ల ఆగిన వరికోతలు
- కోసిన ధాన్యాన్ని భద్రపరిచే పనిలో రైతులు
- పత్తి, మినుము పంటకూ దెబ్బే..
- తుపాన్ హెచ్చరికతో దళారీల చేతివాటం
- జిల్లాలో ఈ నెల 29 వరకు వర్షసూచన


రామనపల్లె వద్ద నేలకొరిగిన వరిపంట



కడప అగ్రికల్చర్/ పొద్దుటూరు రూరల్: ప్రకృతి వైపరిత్యాలు వ్యవసాయ రంగాన్ని కుదేలు చేస్తున్నాయి. ఆరుగాలం కష్టపడి పంటలు సాగు చేసిన రైతన్నలకు పంట చేతి కొచ్చే సమయానికి అప్పులే మిగులుతున్నాయి. సెప్టెంబర్‌లో వచ్చిన తుపాన్ చాలా మంది వరి, పత్తి, మినుము, రైతులకు నష్టం కలిగించింది. మళ్లీ తాజాగా ఏర్పడిన తుపాన్‌తో అన్నదాతల్లో ఆందోళన మొదలయింది. ముఖ్యంగా వరి రైతులు మరింత ఆందోళన చెందుతున్నారు. ముందస్తుగా, ఆ తరువాత వరిపంటను సాగు చేసిన రైతుల్లో మరింత గుబులు పట్టుకుంది. ఈ నెల 29 తేదీ వరకు ఈ వర్షాలు కొనసాగుతాయని వాతావరణశాఖ చెబుతోంది. దీంతో జిల్లాలో చాలామంది రైతులు వరికోతలను నిలిపేసుకున్నారు. మరి కొంతమంది కోతకు సిద్ధంగా ఉన్న వరిపంటను గత వారం రోజుల నుంచి ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుని వరికోత మిషన్లతో వరి కోసుకుని ధాన్యాన్ని పొలం నుంచి బయటకు తెచ్చుకుని ప్రధాన రోడ్లపైన ఆరుబెట్టుకుంటున్నారు. వర్షం వస్తే ధాన్యం దెబ్బ తింటుందని ఆందోళనలో కొంతమంది రైతులు ధాన్యాన్ని తెగనమ్ముకుంటున్నారు.. మరి కొంతమంది రైతులు వెనకాముందు అన్నట్లు ఆలోచనలో పడి కోతలను ఆపేసుకున్నారు.



నా పేరు వెంకట సుబ్బారెడ్డి. మాది ప్రొద్దుటూరు మండలం కానపల్లె గ్రామం. నేను పది ఎకరాల్లో వరిపంట సాగు చేశాను. దాదాపు పది ఎకరాలకు రూ. 3 లక్షల వరకు ఖర్చు అయ్యింది. మరో రెండు మూడు రోజుల్లో వరి కోత చేపట్టేందుకు సిద్ధం అయ్యాను. ఇంతలో తుపాన్ అని చెప్పారు. దీంతో వరికోతను ఆపే శాను. పెద్దవర్షం పడితే పంట దెబ్బతినే ప్రమాదం ఉంది. నష్టం మూటగట్టుకో వాల్సి వస్తుంది.

ఇది ఈ ఇద్దరి రైతుల ఆవేదనే కాదు.. జిల్లా వ్యాప్తంగా పంటలు సాగు చేసిన రైతులది. ముఖ్యంగా వరి పంట కోత దశలో ఉన్నందున ఆ పంట సాగు చేసిన అన్నదాతలు మరింత ఆందోళనలో ఉన్నారు.



నా పేరు వజ్జల వెంకటసుబ్బయ్య. మాది పొద్దుటూరు మండలం కానపల్లె. నేను రూ. 60 వేలు ఖర్చు పెట్టి రెండు ఎకరాల్లో వరిపంటను సాగు చేశాను. పంట చేతికొచ్చే సమయంలో తుపాన్ అని హెచ్చరికలు చేస్తున్నారు. దీంతో నాలుగు రోజులకుపైగా వర్షం వస్తుందని చెబుతున్నారు. దీంతో ఆందోళనగా ఉంది. వర్షం పెద్దగా కురిస్తే నష్టం తప్పదు.

జిల్లాలో 30 వేల హెక్టార్లకుపైగా వరిసాగు...

జిల్లాలో గత ఖరీఫ్, ప్రస్తుత రబీ సీజన్‌లు కలుపుకుని పెన్నా, కుందూ నది పరివాహక ప్రాంతాలైన చాపాడు, పొద్దుటూరు, చెన్నూరు, కడప, సిద్ధవటం, ఒంటిమిట్ట, మైలవరం మండలాల పరిధిలోని బోర్లు, పిల్లర్ల కింద ఈ ఏడాది చాలా మంది రైతులు వరి పంటను సాగు చేసుకున్నారు. ఖరీఫ్ ముగిసి, రబీ ప్రారంభం నాటికి జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో 30 వేల హెక్టార్లకుపైగా వరిపంటను సాగు చేశారు. ముందస్తుగా, ఆ తరువాత వరిపంటను సాగు చేసుకున్న రైతులకు సంబంధించి కొన్ని చోట్ల కోతదశలో ఉండగా మరి కొన్ని చోట్ల చిరుపొట్ట దశలో ఉంది. ఇందులో ముందస్తుగా సాగు చేసుకున్న రైతులు అక్టోబర్ నెలలో వరి కోతలు చేసుకోగా ఆ తరువాత సాగుచేసుకున్న రైతులు మాత్రం ప్రస్తుతం ముమ్మరంగా వరికోతలలో నిమగ్నం అయ్యారు.

ఆపుకున్న కోతలు....

ప్రస్తుతం ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో మంగళవారం నుంచి వర్షాలు ఆరంభమయ్యాయి. దీంతో చాలామంది రైతులు వరికోతలను ఆపుకున్నారు. కొన్ని చోట్ల వరి కోతలు కోసిన రైతులు ధాన్యాన్ని భద్రపరిచే పనిలో పడ్డారు. కాకపోతే పచ్చిధాన్యం కావడంతో పట్టలు కప్పి ఉంచితే వేడికి మొలక వస్తాయని ఆందోళన చెందుతున్నారు. లేకుంటే ఉక్కకు వడ్ల నాణ్యత దెబ్బతినే ప్రమాదం కూడా ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. దళారీలు కూడా దీన్ని అదునుగా తీసుకుని ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈ నెల మొదటివారంలో 78 కేజీల బస్తా ధాన్యం ధర రూ. 1750 ఉండగా ప్రస్తుతం అదే బస్తా ప్రస్తుతం రూ.1400 అడుగుతున్నారని రైతులు వాపోతున్నారు. తుపాన్ మాత్రం వరిరైతు గుండెల్లో గుబులును నింపింది.

తుపాన్ భయం


రాజుపాళెం: పొలాల్లో ఆరబోసిన వరి ధాన్యాన్ని కుప్పగా పోస్తున్న రైతులు

తుపాన్ ప్రభావంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. రాజుపాళెం మండలంలోని కుందూతీర గ్రామాల్లో ముమ్మరంగా వరిపంట నూర్పిళ్లు జరుగుతున్నాయి. మరికొన్ని గ్రామాల్లో మినుము, పెసర, మొక్కజొన్న, నూగు పంటల నూర్పిళ్లు ప్రారంభమయ్యాయి. ఆకాశంలో మబ్బులు ఉండటంతో నూర్పిళ్లను మరింత వేగవంతం చేశారు. మంగళవారం చిరుజల్లులు పడటంతో పొలాల్లో, రోడ్లపై ఆరబోసిన వరి ధాన్యాన్ని ఆరకుండానే ఇళ్లకు, గోదాములకు తరలిస్తుండగా మరికొందరు వరిధాన్యానికి పట్టలు కప్పుకుంటున్నారు. - రాజుపాళెం

33 గ్రామాల పరిధిలో...

సెప్టెంబర్ నెలలో వచ్చిన తుపాన్ కారణంగా జిల్లాలో 33 గ్రామాల పరిధిలో 2024.2 ఎకరాల్లో వరిపంట పూర్తిగా నేలమట్టమైంది. దీంతో పాటు 254 ఎకరాల్లో మినుము కూడా దెబ్బతినింది. దీంతో ప్రస్తుత తుపాన్‌తో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. పత్తి కొన్ని చోట్ల కాయదశలో ఉంది. ఈ వర్షం నీరు కాయలోకి దిగి పత్తి దెబ్బతినే అవకాశం ఉంది.

రైతులు అప్రమత్తంగా ఉండాలి



తుపాను ప్రభావంతో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వరి కోతకు సిద్ధంగా ఉండే రైతులు కూడా వరి కోతలను వాయిదా వేసుకోండి. వరి కోసిన రైతులు వరిధాన్యం తడవకుండా పట్టలను కప్పాలి. వర్షం అధికంగా వస్తే పొలాల్లో నీరు నిల్వలేకుండా చూడాలి. పడిపోయిన పంటపై ఉప్పు ద్రావణం పిచికారి చేస్తే ధాన్యం మొలకెత్తకుండా ఉంటుంది. - అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలి

- కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి
- ఘనంగా 75 వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలు


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి , జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్: రాజ్యాంగ స్ఫూర్తి, రాజ్యాంగ భావనను ప్రతి ఒక్క పౌరుడు కొనసాగించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభా భవన్ హాలులో 75వ భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ అధ్యక్షత వహించగా జేసీ అదితి సింగ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. తొలుత కలెక్టరేట్ ప్రాంగణంలోని భారతరత్న అంబేద్కర్ విగ్రహానికి కలెక్టర్ శ్రీధర్ , జేసీ అదితి సింగ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ 75వ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటిష్ పాలనలో ఎన్నో ఒడిదుడుకులు తట్టుకొని మన దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగ రచన సభ్యులు భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఇందులో కర్త, కర్మ క్రియ తానై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ముఖ్య భూమిక పోషించారన్నారు. దేశంలో ఎన్నో వైవిధ్యతలు వచ్చినప్పటికీ సుస్థిర రాజ్యాన్ని కొనసాగించడంలో మన దేశ రాజ్యాంగం ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. జేసీ అదితి సింగ్ మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను ప్రతి పౌరుడు కాపాడి దేశ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని కోరారు. అనంతరం భారత రాజ్యాంగ ప్రవేశిక లోని న్యాయ చట్టాల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు.

- జిల్లా రెవెన్యూ అధికారి డీఆర్వో విశ్వేశ్వర్ నాయుడు, కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, కమిషనర్ మనోజ్ రెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ నాగేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా పంచాయతీరాజ్ శాఖ అధికారి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘన

- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి
- పార్టీ కార్యాలయంలో ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం


అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి, అంజద్‌బాషా, సురేష్‌బాబు తదితరులు

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో యథేచ్ఛగా రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి ఆరోపించారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలతో కలిసి భారత రత్న డా. బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నో ఉన్నతాశయాలతో డా. బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగాన్ని రచించారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలను ఆయన చూసి ఉంటే చాలా బాధపడి ఉండేవారన్నారు. రాజ్యాంగం ఎంత మంచిగా ఉన్నా పాలకుడు చెడ్డవాడైతే అది కూడా చెడ్డదవుతుందని, పాలకుడు మంచివాడైతే రాజ్యాంగం సరిగా లేకపోయినా ప్రజలకు మేలు జరుగుతుందని అంబేద్కర్ ఆనాడే చెప్పారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం ప్రతి విషయంలోనూ రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని, టీడీపీకి ఓట్లు వేయలేదన్న కారణంతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులను హింసిస్తున్నారని, వారిని జైళ్లలో వేసి వేధిస్తున్నారన్నారు. వీరికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయన్నారు.

- మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా గొప్పదన్నారు. రాష్ట్రంలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతోందని, లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోందన్నారు. ప్రతిపక్షం లేకుండా చేయాలన్న ఏకైక లక్ష్యంతో ప్రజల గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరునెలలైనా ప్రజలకు చేసింది శూన్యమన్నారు. ఎన్నికల హామీలు తుంగలో తొక్కి ప్రశ్నించే వారిని హింసిస్తున్నారన్నారు.
- ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్‌కుమార్, జయచంద్రారెడ్డి, నిత్యానందరెడ్డి, కరిముల్లా, బండి ప్రసాద్, రెడ్యం వెంకట సుబ్బారెడ్డి, దాసరి శివప్రసాద్, జాషువా, కె. బాబు, పత్తి రాజేశ్వరి, టీపీ వెంకట సుబ్బమ్మ, రత్నకుమారి, తులశమ్మ, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అందని వేతనం.. బతుకు భారం

- ఐడీసీ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెన్‌డౌన్
- వర్క్ ఆర్డర్ మార్పుతో ప్రమాదంలో ఉద్యోగ భద్రత
- ఇరిగేషన్‌లో విలీనం ద్వారా రెగ్యులర్ చేయాలని డిమాండ్
- వేతనాలు ఇవ్వకపోగా మెమోలు జారీ
- స్పందించని కూటమి ప్రభుత్వం



కడపలోని ఏపీఎస్ ఐడీసీ కార్యాలయం.


పెన్‌డౌన్ ద్వారా నిరసన వ్యక్తం చేస్తున్న ఏపీఎస్ ఐడీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఉద్యోగులకు వేతనాలు ఇవ్వలేదు. దీంతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలో అర్థం కాక సతమతమవుతున్నారు. ఎవరూ అప్పులు కూడా ఇచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అరియర్స్ సహా ప్రతినెల 1వ తేదీ వేతనాలు చెల్లించాలని ఇప్పటికే పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేదు. ఆందోళన కార్యక్రమాలు చేపడితే క్రమశిక్షణా చర్యలు చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో గత్యంతరం లేని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పెన్‌డౌన్ చేపట్టారు.

- జిల్లాలోని వివిధ ప్రాజెక్టుల కింద రైతులకు సాగునీరు అందించడంలో ఏపీఎస్ ఐడీసీ కీలకపాత్ర వహిస్తోంది. జిల్లాలో 34 ఎత్తిపోతల పథకాలు ఉండగా, వాటి కింద 23,600 ఎకరాల ఆయకట్టు ఉంది. కొత్తగా ఆరు ఎత్తిపోతల పథకాలు నిర్మాణ దశలో ఉన్నాయి. వీటి కింద ఆరు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. ఐడీసీలో గత 20 ఏళ్ల నుంచి అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జూనియర్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్, వాచ్‌మెన్ తదితర హోదాల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారు. వివిధ క్యాడర్లలో పనిచేస్తున్న వీరికి రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. వేతన బకాయిలు సత్వరమే ఇవ్వాలని, లేనిపక్షంలో ఈనెల 25 నుంచి పెన్‌డౌన్ చేస్తామంటూ ఐడీసీ మేనేజింగ్ డైరెక్టర్‌కు ఇంతకుముందే తెలిపారు. గతంలో కూడా పది నెలలు వేతనాలు అందనప్పటికీ ఎలాంటి ఆందోళనలు నిర్వహించకుండా యాజమాన్యాలకు సహకరించామని, ఇక గత్యంతరం లేని పరిస్థితుల్లోనే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తెలిపారు. అయితే వేతనాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాల్సిన యాజమాన్యం ఆ బాధ్యతను విస్మరించి ఉద్యోగులకు మెమోలు జారీ చేసింది. పెన్‌డౌన్ చేసిన ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. క్రమశిక్షణా చర్యలతోపాటు నో వర్క్..నో పే పాలసీని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై కూడా అమలు చేస్తామని స్పష్టం చేసింది. ఉద్యోగులకు ప్రతినెల వేతనాలు అందకపోవడంతో ఎంతో ఆర్థిక భారాన్ని మోయాల్సి వస్తోంది. ఖర్చులు ఓవైపు పెరిగిపోతుండగా, జేబులో చిల్లిగవ్వ లేని పరిస్థితుల్లో కుటుంబ నిర్వహణ పెద్ద ఇబ్బందిగా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. క్యాడర్‌ను అనుసరించి రావాల్సిన వార్షిక వేతన పెంపు రెండేళ్లుగా ఇవ్వలేదు. రోజురోజుకు జీవన వ్యయం పెరిగిపోతోందని, బతుకు బండి లాగడం గగనంగా మారిందంటున్నారు. క్యాడర్‌కు అనుగుణంగా మినిమం బేసిక్ పే నిర్ణయించి, సమాన వేతనాన్ని అందరికీ వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

- ఔట్‌సోర్సింగ్ కింద పనిచేస్తున్న ఏఈలు, ఏఈఈలు, టెక్నికల్ అసిస్టెంట్లకు టీఏ బిల్లులు కూడా ప్రభుత్వం నుంచి రాలేదు. ఎప్పటికప్పుడు టీఏ బిల్లులు చెల్లించాలంటున్నారు. ఆప్కాస్‌లో విలీనం చేసిన తర్వాత నుంచి ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా పరిగణించడం పోయింది. దీంతో వీరికి రావాల్సిన ఆరోగ్య, ఆర్థిక ప్రయోజనాలను ప్రభుత్వం నిలిపి వేసింది. రెగ్యులర్ ఉద్యోగులతోపాటు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కూడా సమానంగానే పనిచేస్తున్నారు. అయినా తమను ఉన్నతాధికారులు తక్కువచేసి మాట్లాడటం ద్వారా ఆత్మగౌరవాన్ని కించపరుస్తున్నారని వారు వాపోతున్నారు.

ప్రమాదంలో ఉద్యోగ భద్రత

ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల కారణంగా ఐడీసీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు భద్రత ప్రమాదంలో పడుతోంది. గతంలో వీరికి సంవత్సర కాలానికిగాను వర్క్ ఆర్డర్ ఇచ్చేవారు. అయితే ఈ యేడు ఏప్రిల్ నుంచి మూడు నెలలకు ఒకసారి వర్క్ ఆర్డర్ జారీ చేయడం వల్ల తమ ఉద్యోగ భద్రతపై అనేక సందేహాలు ఏర్పడుతున్నాయని వారు అంటున్నారు. ఈ అంశాన్ని బోర్డు సభ్యుల ముందు ఉంచి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయడం లేదా కాంట్రాక్టు బేసిస్‌లోకి మార్చే విధంగా చర్యలు చేపడితే తమకు ఉద్యోగ భద్రత లభిస్తుందంటున్నారు. ఐడీసీని జల వనరులశాఖలో విలీనం చేస్తే తాము కూడా రెగ్యులర్ అయ్యేందుకు అవకాశం ఉంటుందని వీరు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలంటున్నారు.

యాప్‌లో తెగుళ్ల నివారణ చర్యలు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు

కడప అగ్రికల్చర్: నేషనల్ పెస్ట్ సర్వేయిలాన్స్ సిస్టమ్(ఎన్‌పిఎస్‌ఎస్) యాప్ ద్వారా రైతులు పంటలకు సంబంధించి పురుగు, తెగుళ్ల నివారణ చర్యలు త్వరగా తెలుసుకుని పంటలను రక్షించుకోవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు పేర్కొన్నారు. మంగళవారం కడప జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయంలో కడప, అన్నమయ్య జిల్లాల రైతులకు, వ్యవసాయ అధికారులకు ఎన్‌పిఎస్‌ఎస్- జాతీయ పురుగు నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విజయవాడ కార్యాలయం నుంచి ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ వీరయ్య చౌదరి ఎన్‌పీఎస్‌ఎస్ యాప్ ఏవిధంగా ఉపయోగించాలో వివరించారు. యాప్ డౌన్‌లోడ్‌పై అవగాహన కల్పించారు. ఈ మొబైల్ యాప్ ఉపయోగాలు వివరించారు. ఈ కార్యక్రమంలో జేడీ కార్యాలయ ఏడీ మాధవి, అన్నమయ్య జిల్లా ఏడీఏ మజీద్ అమ్మద్, జేడీ కార్యాలయ టెక్నికల్ ఏవో గోవర్ధన్, రెండు జిల్లాలకు సంబంధించిన వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రవాణా అధికారుల స్పెషల్ డ్రైవ్

– 10 వాహనాలు సీజ్



చిట్వేలి–కోడూరు రహదారిలో వాహనాలను తనిఖీ చేస్తున్న బ్రేక్ ఇన్‌స్పెక్టర్, ఆర్టీసీ డీఎం

రాజంపేట : చిట్వేలి–కోడూరు మార్గంలో రవాణాశాఖ, ప్రజారవాణాశాఖ సంయుక్తంగా సోమవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఎంవీఐ వినోద్‌కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ రమణయ్య తమ శాఖల సిబ్బందితో పలు వాహనాలను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని వాహనదారులకు రూ.74వేలు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ రోడ్డు ప్రమాద నివారణ చర్యలు చేపట్టని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. డిపో మేనేజర్ రమణయ్య మాట్లాడుతూ ప్రైవేటు వా హనాల్లో ఓవర్‌లోడ్‌తో తరలిస్తుంటే చర్యలు తప్పవన్నారు. ప్రజలు ఆర్టీసీ బస్సుల ద్వారా తమ గమ్యాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో రవాణా, ఆర్టీసీ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



సంఘటన స్థలంలో శ్రీను మృతదేహం

రాయచోటి టౌన్ : రాయచోటి పట్టణానికి చెందిన శ్రీను (45) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పట్టణ శివార్లలోని వరిగ రోడ్డులో చిన్నపాటి గుట్టకు పక్కన నిర్మానుష్య ప్రదేశంలో మృతదేహం పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించారు. మృతుడు రాయచోటి పట్టణంలోని 15వ డీలర్ షాప్ వాహనంలో బియ్యం పంపిణీ సహాయకుడిగా పని చేసేవాడు. సమాచారం అందుకున్న అర్బన్ సీఐ చంద్రశేఖర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తలకు రక్తగాయాలు ఉండటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ సంఘటనపై అర్బన్ సీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ మృతుడు సోమవారం రాత్రి 8–30 గంటల తరువాత ఎవరి ఫోన్ తీయలేదన్నారు. అతని ఆచూకీ కోసం వెతికినా కనిపించలేదన్నారు. మంగళవారం సాయంత్రం మృతదేహాన్ని గుర్తించామని చెప్పారు. సంఘటన స్థలంలో మద్యం సీసాలు ఉన్నాయన్నారు. మృతుడు మద్యం తాగి మృతి చెందాడా.. లేక మద్యంలో ఏదైనా విషం కలపడం వలన మృతి చెందాడా అనే కోణంలో విచారణ చేస్తున్నామని తెలిపారు.

తనయుడి దాడిలో గాయపడిన తల్లి మృతి

పెద్దమండ్యం : ఓ తనయుడు వృద్ధురాలైన తన తల్లిపై రోకలిబండతో విచక్షణా రహితంగా చేసిన దాడిలో గాయపడిన తల్లి సోమవారం రాత్రి మృతి చెందింది. ఆదివారం తనయుడి దాడిలో తల్లి రెండు కాళ్లు విరిగిపోగా, తలకు తీవ్ర గాయాలైన విషయం తెలిసిందే. ఈ హృదయ విదారక సంఘటన మండలంలోని సీ గొల్లపల్లెలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. బోడెం ఓబులమ్మకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండవ కుమారుడు బోడెం ఓబులేసు వివాహితుడు. అయితే మనస్పర్థలు రావడంతో ఇతని భార్య పిల్లలను తీసుకెళ్లి వారి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. ఈ క్రమంలో ఓబులేసు తనతల్లి ఓబులమ్మ (70) వద్దే ఉంటున్నాడు. మద్యం మత్తులో ఉన్న ఓబులేసు తన తల్లిపై రోకలి బండతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. పరిస్థితి విషమంగా ఉండడంతో స్విమ్స్ వైద్యులు చెన్నైకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ఓబులమ్మను ఇంటికి తీసుకురాగా సోమవారం రాత్రి మృతి చెందింది.

టెండర్ వేసేందుకు వెళ్తే దాడికి యత్నిస్తారా?

ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు

ప్రొద్దుటూరు క్రైం : రాజుపాళెం మండలానికి సంబంధించి రహదారుల పనులకు టెండర్ వేయడానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులను బెదిరించడమే గాక వారిపై టీడీపీ నాయకులు దాడికి ప్రయత్నించారని ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి తెలిపారు. వైఎంఆర్ కాలనీలోని పోరెడ్డి నరసింహారెడ్డి నివాసంలో ఆయన మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజుపాళెం మండలంలోని చిన్నశెట్టిపల్లె– గాదెగూడూరు, పొట్టిపాడు–కుమ్మరపల్లె రోడ్డు పనులకు రూ. 11 కోట్లతో రెండు టెండర్లు పిలిచారన్నారు. ఈ రెండు పనులు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో సర్వే చేయించి మంజూరు చేయించినట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గానీ, రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తులెవరూ టెండర్ వేయద్దొనే విధంగా టీడీపీ నాయకులు దౌర్జన్యం చేస్తున్నారన్నారు. ఈ పనులకు సంబంధించి కొన్ని పత్రాలను ఇవ్వడానికి తమ పార్టీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామచంద్రారెడ్డితో పాటు మరో ఇద్దరు సోమవారం కడప ఎస్‌ఈ కార్యాలయానికి వెళ్లారన్నారు. అప్పటికే పర్లపాడు మహేశ్వరరెడ్డి, కొర్రపాడు రామచంద్రారెడ్డితో పాటు సుమారు 20 మందికి పైగా టీడీపీ నాయకులు అక్కడికి చేరుకున్నారని తెలిపారు. టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ నాయకుల వద్ద ఉన్న పేపర్లను లాక్కునే ప్రయత్నం చేయడంతో పాటు వారిపై దాడికి యత్నించారని తెలిపారు.

షెడ్యూల్ ఇవ్వకుండా బెదిరిస్తున్నారు..

అర్హత కలిగిన కాంట్రాక్టర్ల నుంచి టెండర్ షెడ్యూల్ తీసుకోవడానికి తమ వారు వెళ్తే తమకు ఇవ్వొద్దంటూ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డితో పాటు ఇక్కడి కొందరు టీడీపీ నాయకులు ఆ కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని ఆయన తెలిపారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి తన కుమారుడు కొండారెడ్డికి పూర్తిగా సహకరించే పనిలో ఉన్నారని చెప్పారు. టీడీపీ నాయకుల చర్యలు గ్రామాల్లో ఫ్యాక్షన్ కు దారి తీసేలా ఉన్నాయన్నారు. కడప ఎస్‌ఈ కార్యాలయంలో జరిగిన గొడవకు సంబంధించి జిల్లా ఎస్పీ పూర్తి స్థాయిలో విచారణ చేయాలన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్మన్ జేష్టాది శారద, జెట్పీటీసీ జీరెడ్డి అంజనీ కుమారి, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల ఎంపీపీలు శేఖర్‌యాదవ్, సావిత్రి సలోని, మాజీ ఎంపీపీ మెట్టుపల్లె ప్రభాకర్‌రెడ్డి, పగిడేల రామచంద్రారెడ్డి, కొర్రపాడు కాటిగారి ప్రతాపరెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, తొండలదిన్నె రాజారాంరెడ్డి, వెలవలి శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేం వచ్చిందే టైం!

ప్రభుత్వ కార్యాలయాల్లో అందుబాటులో లేని అధికారులు, సిబ్బంది



పీబీసీ కార్యాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణంలోని రింగ్ రోడ్డు న్యాక్ బిల్డింగ్ సమీపంలో ఉన్న జీఎన్‌ఎస్‌ఎస్, జీకేఎల్‌ఐ, పైడిపాలెం డివిజన్ కార్యాలయాల సముదాయంలో అధికారులు వారికి ఇష్టమొచ్చినట్లు విధులు నిర్వర్తిస్తున్నారు. మంగళవారం జీఎన్‌ఎస్‌ఎస్ కార్యాలయంలో అధికారులు లేకపోవడంతో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. తమ కుర్చీలలో ఉండాల్సిన సిబ్బంది, అధికారులు ఎలాంటి పనులు లేకపోవడంతో అందరూ ఒకే చోట కూర్చొని కబుర్లు చెప్పుకుంటున్నారు. జీఎన్‌ఎస్‌ఎస్. పైడిపాలెం డివిజన్ కార్యాలయాల్లో, కార్మిక శాఖ కార్యాలయాల్లో సిబ్బంది, సంబంధిత అధికారులు విధులకు ఇష్టమొచ్చినట్లు వస్తూ వెళుతున్నారు. కార్యాలయానికి వెళ్లిన పాత్రికేయులు విధుల నిర్వహణపై ప్రశ్నిస్తే మీరు ఏమైనా సీబీఐ అధికారులా అని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులను వివరణ కోరగా పాత్రికేయులే కాదు, ప్రజలు కూడా కార్యాలయాలకు ఎప్పుడైనా రావచ్చు, వెళ్లొచ్చని సమాధానం ఇచ్చారు.

యుద్ధంతో మానవాళికి ముప్పు

రాయచోటి అర్బన్ : యుద్ధంతో మానవాళికి తీరని ముప్పు ఏర్పడుతుందని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళవారం రాయచోటిలో 'సేవ్ వరల్డ్– నో వార్' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ప్రముఖ వైద్యుడు బయారెడ్డి మాట్లాడుతూ యుద్ధాల వలన ప్రజల ప్రశాంత జీవనానికి ముప్పు వాటిల్లుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికమార్గంలో పయనిస్తూ ప్రపంచ శాంతికి పాటుపడాలన్నారు. ఆధ్యాత్మికవేత్త సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచంలో ఆధిపత్య పోరులో భాగంగా జరుగుతున్న యుద్ధాలు భవిష్యత్తులో అణు యుద్ధాలకు దారితీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. లయన్స్‌క్లబ్, రోటరీక్లబ్‌ల మాజీ అధ్యక్షులు నాగేశ్వరరావు ఎస్.కె.హుస్సేన్ మాట్లాడుతూ యుద్ధాల పట్ల ఉన్న వ్యతిరేకతను ప్రపంచ దేశాల దృష్టికి తీసుకెళ్లాలన్నారు.

బేస్‌బాల్ క్రీడల్లో రాష్ట్ర స్థాయిలో మూడో స్థానం

రాయచోటి టౌన్ : తిరుపతిలో అండర్ –14 విభాగంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బేస్‌బాల్ క్రీడా పోటీల్లో బాలికలు, బాలుర విభాగంలో రెండింటిలోనూ ఉమ్మడి కడప జిల్లా జట్లు మూడో స్థానం దక్కించుకున్నాయి. కాగా రాయచోటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వతరగతి చదువుతున్న ఎం. సంతోష్, 8వ తరగతి చదువుతున్న బి. సంతోష్‌లు జాతీయ జట్టుకు ఎంపికయ్యారని రాయచోటి మాసాపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ జగదీశ్వరయ్య తెలిపారు. జాతీయ జట్టుకు ఎంపికైన ఇద్దరు క్రీడాకారులు డిసెంబర్ నెలలో ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే బేస్‌బాల్ క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. వీరిని ఫిజికల్ డైరెక్టర్లు ప్రసాద్, వేణు మాధవ్ రాజు, రవీంద్రరాజు అభినందించారు.

సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీకి ఎంపిక

లక్కిరెడ్డిపల్లి : మండల పరిధిలోని చౌటపల్లి పంచాయతీ, గొల్లపల్లికి చెందిన సోడి వెంకటేశ్వర్లు కుమార్తె సోడి ఇందు ఎస్వీ యూనివర్సిటీలో బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈమె సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ మహిళల విభాగానికి ఎంపికైనట్లు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఈనెల 29వ తేదీ అలగప్ప యూనివర్సిటీ కరైకుడిలో ఈ పోటీలు జరుగుతాయన్నారు.

కార్మికులు, రైతాంగంపై మొండి వైఖరి వీడాలి

- అఖిలపక్ష కార్మిక, రైతు సంఘాల నేతృత్వంలో కలెక్టరేట్ వద్ద మహాధర్నా
- సంఘీభావం తెలిపిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి



ధర్నాలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి : కార్మికులు, రైతాంగం విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మొండివైఖరి వీడాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ.రామాంజులు అధ్యక్షతన ఆల్ ట్రేడ్ యూనియన్స్, అఖిలపక్ష రైతు సంఘాల మహాధర్నా నిర్వహించారు. ఒకవైపు వర్షపు జల్లులు కురుస్తున్నా కార్మిక కర్షక సంఘాల నాయకులు, కార్మికులు కలెక్టర్ కార్యాలయం ఎదుట నినదించారు. ఈ కార్యక్రమానికి సంఘీభావంగా గడికోట శ్రీకాంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసర ధరలు అమాంతం పెరిగిపోవడంతో సామాన్య, పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆకలి కేకలతో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పేద మధ్య తరగతి కుటుంబాలను ఆదుకొని, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ మూడోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం కేవలం కార్పొరేట్లకు లాభాల కోసమే ఊడిగం చేస్తోందని ఆరోపించారు. అందుకే వారికి సంబంధించిన రూ.15 లక్షల కోట్లు రుణమాఫీ చేశారన్నారు. కార్మికులకు నష్టం తెచ్చే నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగ పరిశ్రమలు కాపాడుకోవాల్సిన బాధ్యత అందరి మీద ఉందన్నారు. రైతుల ఆత్మహత్యలు నివారించాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోక కృష్ణప్ప, సీఐటీయూ జిల్లా కోశాధికారి హరిశర్మ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి భాగ్యలక్ష్మి, రవికుమార్, శ్రీలక్ష్మి, సురేంద్ర, మెహరున్నీసా, ఏపీఎండీసీ శ్రీనివాసులు, ఎస్‌ఎస్‌ఏ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రాజు, ప్రకృతి వ్యవసాయం జిల్లా అధ్యక్షుడు మాధవయ్య వివిధ కార్మిక సంఘాల నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జిల్లా అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే మాధవీరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవీరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలు స్థానిక డీకే ముఖర్జీ భవనంలో నిర్వహించారు. తొలుత అసోసియేషన్ నాయకులు, ఎమ్మెల్యే ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులకు ఆరాధ్యుడు కామ్రేడ్ దిలీప్ కుమార్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. ఏపీజీబీ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ రెడ్డి, ఎంప్లాయిస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ మాట్లాడుతూ ప్రాంతీయ గ్రామీణ బ్యాంకుల్లో ఎప్పటికప్పుడు నూతన సంస్కరణలు ఏర్పడి ప్రజలకు అధునాతనమైన బ్యాంకింగ్ వ్యవస్థ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ఒక రాష్ట్రం ఒకే గ్రామీణ బ్యాంక్ పాలసీలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని సప్తగిరి గ్రామీణ బ్యాంకు, చైతన్య, గోదావరి గ్రామీణ బ్యాంకు, ఆంధ్ర వికాస్ గ్రామీణ బ్యాంకులు ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకులో విలీనం అవుతున్నాయన్నారు. కొత్తగా ఏర్పడే ఆంధ్ర రాష్ట్ర గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించాలని కూటమి ప్రభుత్వం యోచిస్తోందన్నారు. ఈ నిర్ణయం వెనుకబడిన రాయలసీమ ప్రాంతంలోని ప్రజలకు గొడ్డలి పెట్టు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, డిప్యూటీ జనరల్ సెక్రటరీ లోహిత్ మనోజ్, ట్రెజరర్ రాహుల్ తేజ్, రీజియన్ సెక్రటరీ రఫీ, ఎస్సీఎస్టీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సురేష్, ఆర్ఆర్ఆర్ బీఎస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ రెడ్డి, ఏపీజీబీ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ



కడపలోని జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

కడప అర్బన్ : జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీదేవి ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం కడపలోని జిల్లా కోర్టు ఆవరణంలో న్యాయమూర్తులచేత రాజ్యాంగ దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి ఎల్. వెంకటేశ్వరరావు, ఆరవ అదనపు జిల్లా న్యాయమూర్తి షేక్ ఇంతియాజ్ అహ్మద్, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.రమేష్‌కుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫక్రుద్దీన్, సీనియర్ సివిల్ జడ్జి ఎస్. ప్రవీణ్‌కుమార్, అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి కె.ప్రత్యూష కుమారి, ఎక్సైజ్ కోర్టు జడ్జి జె. హేమస్రవంతి, మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. నందిని, రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. భార్గవి, మూడవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి. విజయలక్ష్మి, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బెటాలియన్‌లో రాజ్యాంగ దినోత్సవం



పోలీసు సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న అసిస్టెంట్ కమాండెంట్ వెంకటరెడ్డి

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్ కె. వెంకటరెడ్డి ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగం పట్ల వినయ విధేయతలు కలిగి ఉంటామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగమే ప్రజలకు రక్ష



రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు

రాయచోటి : రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులు, చట్టాలే ప్రజలకు రక్షణ అని అలాంటి రాజ్యాంగాన్ని అందరూ గౌరవించాలని జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పేర్కొన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని రాయచోటిలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి ఎస్పీ పూల మాల వేసి నివాళులు అర్పించారు. రాజ్యాంగానికి లోబడి ప్రతి ఒక్కరూ పనిచేస్తూ దేశాభివృద్ధిలో పాలు పంచుకోవాలన్నారు. రాజ్యాంగ పరిరక్షణలో పోలీస్ శాఖ పాత్ర ముఖ్యమైందన్నారు. అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది రాజ్యాంగ బద్ధంగా నడవాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం.వెంకటాద్రి, ఏఆర్ డీఎస్పీ బి చిన్నికృష్ణ, ఎస్‌బీ సీఐ సత్యనారాయణ, ఆర్ఐ అడ్మిన్ వీజె రామ కృష్ణ, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రైస్‌పుల్లింగ్ పేరుతో మోసం

- రూ. 1.30 కోట్లు వసూలు
- పోలీసుల అదుపులో ఇద్దరు మహిళలు

ప్రొద్దుటూరు క్రైం : ప్రస్తుతం రకరకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈజీ మనీకి అలవాటు పడిన కొందరు వ్యక్తులు సులభంగా డబ్బు సంపాదించేందుకు మోసాల బాటపడుతున్నారు. అమాయకులు, అత్యాశ పరులను టార్గెట్ చేసి సులభంగా డబ్బు కొట్టేస్తున్నారు. ట్రెండ్‌కు తగ్గట్టుగా మోసాలు చేస్తూ నమ్మకంగా ఉన్నట్లు నటిస్తూ వారిని నట్టేట ముంచుతున్నారు. తాజాగా ప్రొద్దుటూరులో ఓ భారీ మోసం వెలుగులోకి వచ్చింది. రైస్‌పుల్లింగ్ పేరుతో ముగ్గురు మహిళలు మూలె వెంకటరమణారెడ్డి అనే వడ్ల వ్యాపారిని బురిడీ కొట్టించిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సుమారు రూ. 1.30 కోట్ల వరకు మహిళలు వ్యాపారి నుంచి విడతల వారీగా వసూలు చేశారు. చివరకు వ్యాపారి చాకచక్యంగా వ్యవహరించడంతో మహిళలు పోలీసులకు దొరికిపోయారు. టూ టౌన్ పోలీసులు తెలిపిన మేరకు.. దువ్వూరు మండలంలోని గోపులాపురం గ్రామానికి చెందిన మూలె వెంకటరమణారెడ్డి రైతు. ఇతను వడ్ల వ్యాపారం కూడా చేస్తుంటాడు. ప్రొద్దుటూరులోని హౌసింగ్ బోర్డు కాలనీలో నివాసం ఉంటున్న శోభారాణి అనే ఉపాధ్యాయురాలు పరిచయమైంది. గతంలో వెంకటరమణారెడ్డి వద్ద నుంచి అప్పుగా డబ్బు తీసుకునేది. ఈ క్రమంలో ఆమె రైస్ పుల్లింగ్ గురించి వివరించి డబ్బు ఆశ చూపెట్టింది. ఇరిడియం లోహం చాలా ఖరీదైందని, దీన్ని తీసుకుంటే ఒకటికి పది రెట్లు లాభం వస్తుందని అతనికి శోభారాణి ఆశ పెట్టింది. బెంగళూరులోని అపర్ణ, కదిరిలో ఉన్న అరుణ అనే ఇద్దరు మహిళలు శోభారాణికి వరుసకు చెల్లెళ్లు అవుతారు. ఈ ముగ్గురు కలిసి రైస్ పుల్లింగ్ గురించి వెంకటరమణారెడ్డికి చెప్పి నమ్మించారు. అధికంగా డబ్బు వస్తుందని ఆశ కలగడంతో వెంకటరమణారెడ్డి 2022 నుంచి విడతల వారీగా వారికి రూ.1.30 కోట్ల వరకు ఇచ్చాడు. ఇటీవల మోసపోయానని గ్రహించిన అతను డబ్బు ఇవ్వాల్సిందిగా మహిళలను అడిగాడు. ఇస్తామంటూ కాలయాపన చేస్తూ వచ్చిన మహిళలు ఇటీవల మాట మార్చారు. రూ. 1 కోటి ఇచ్చే పార్టీని చూపిస్తే రూ. 5 కోట్లు ఇస్తామని వెంకటరమణారెడ్డితో చెప్పారు. వారిని ఎలాగైనా ఇక్కడికి రప్పించాలని అతను పథకం పన్నాడు. ఇందులో భాగంగానే ప్రొద్దుటూరులో ఒక పార్టీ ఉందని.. ఇక్కడికి వెంటనే రావాలని చెప్పడంతో అపర్ణ, అరుణ అనే ఇద్దరు మహిళలు బెంగళూరు నుంచి మంగళవారం ఉదయం ప్రొద్దుటూరుకు వచ్చారు. వెంకటరమణారెడ్డి ఫిర్యాదు మేరకు ముగ్గురు మహిళలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ యుగంధర్ తెలిపారు.

ఉదయం నుంచి స్టేషన్‌లోనే మహిళలు

బెంగళూరు నుంచి వచ్చిన మహిళల్ని ఓ అధికార పార్టీకి చెందిన నేత ముఖ్య అనుచరుడు, ప్రముఖ వస్త్రవ్యాపారి ప్రమేయంతో ఉదయం నుంచి స్టేషన్‌లోనే ఉంచుకున్నట్లు తెలుస్తోంది. రూ. 85 లక్షలు ఇవ్వాలంటూ అతనే మహిళలపై ఒత్తిడి తెచ్చినట్లు సమాచారం. ఉదయం నుంచి అతను చేసిన ఒత్తిళ్లు, బెదిరింపులు ఫలించలేదు. డబ్బు ఇవ్వడానికి మహిళలు పూనుకోలేదు. దీంతో వారిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు ఇప్పించారు. కాగా తాను బెంగళూరు నుంచి మహిళలను ప్రొద్దుటూరులో వదిలి పెట్టడానికి వచ్చానని, అయితే ఇప్పుడు పోలీసులు తన కారు ఇవ్వలేదని కారు డ్రైవర్ జహీర్ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. తన కారు ఇప్పిస్తే బెంగళూరుకు వెళ్తానని, తాను ఇంటికి రాలేదని భార్యాపిల్లలు ఆందోళన చెందుతున్నట్లు అతను వాపోయాడు.

చదువుతో పాటు క్రీడలను ప్రోత్సహించాలి



రెడ్డికావ్యశ్రీని సన్మానిస్తున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి

వీరబల్లి : విద్యార్థులను చదువుతోపాటు క్రీడల వైపు కూడా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని రాష్ట్ర, క్రీడలు, రవాణా, యువజన శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. మండలంలోని వంగిమల్ల పంచాయతీ, ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని రెడ్డి కావ్యశ్రీ ఇటీవల మధ్యప్రదేశ్‌లో జరిగిన 68వ జాతీయ పోటీలలో ప్రతిభ కనబరచడంతో మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి హాజరైన మంత్రి మాట్లాడుతూ పిల్లలను ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు కూడా క్రీడల వైపు ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ మంత్రి కె.సుబ్రమణ్యం, స్థానిక తహసీల్దార్ శ్రావణి, మండల విద్యాశాఖ అధికారులు రామకృష్ణుడు, కృష్ణయ్య, గ్రామ సర్పంచ్ సరస్వతమ్మ, ఎంపీటీసీ నాగులమ్మ, రూరల్ సీఐ వరప్రసాద్, ఎస్ఐ మోహన్ నాయక్, పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ వాణి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సారూ.. పరిష్కారం చూపరూ.!

రాయచోటి (జగదాంబసెంటర్) : రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మంగళవారం రాయచోటి పట్టణంలోని తమ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి ప్రజలు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇతర జిల్లా నుంచి కూడా ప్రజలు ప్రజా దర్బార్‌కు వచ్చారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి నివేదిక పంపాలి

రాయచోటి అర్బన్ : రాయచోటి నియోజకవర్గంలో పూర్తిస్థాయి సిమెంట్‌రోడ్ల నిర్మాణానికి అవసరమైన నివేదికలను అధికారులు వెంటనే తయారు చేయాలని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖమంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాయచోటి, చిన్నమండెం, సంబేపల్లె, గాలివీడు, లక్కిరెడ్డి ల్లె, రామాపురం మండలాల్లోని అన్ని గ్రామాల్లో ఎక్కడ సిమెంట్ రోడ్ల నిర్మాణం అవసరమో గుర్తించి వాటి ర్మాణానికి నివేదికలు తయారుచేసి అందజేయాలన్నారు. వాటికి ఉన్నతాధికారుల వద్ద అనుమతులు పొంది రోడ్లనిర్మాణం పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ దయాకర్‌రెడ్డితో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తామంటే నేరుగా నాకు తెలపండి

విద్యార్థినులకు సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి సూచన

రాజంపేట టౌన్ : ఎవరైనా తల్లిదండ్రులు బాల్యవివాహాలు చేసేందుకు సిద్ధపడితే నేరుగా తనకు తెలపాలని సబ్‌కలెక్టర్ వైఖోమ్ నిదియాదేవి విద్యార్థినులకు సూచించారు. పట్టణంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సోమవారం రాత్రి సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థినులతో ఓ స్నేహితురాలిలా కలిసిపోయి వారి కష్ట, సుఖాలను తెలుసుకున్నారు. విద్యార్థిదశ ఎంతో విలువైనదని, ఈ దశలో విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని సూచించారు. బాగా చదువుకుంటేనే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. పేదరికం నుంచి బయటపడాలంటే చదువు ఒక్కటే మార్గమన్నారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ ఆహార పదార్థాలు ఎలా ఉంటున్నాయి, హాస్టల్‌లో సౌకర్యాలు ఎలా ఉన్నాయని, వసతిగృహ అధికారిణి ఎలా చూసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తొలుత సబ్‌కలెక్టర్ హాస్టల్‌కు సంబంధించిన రికార్డులను, సరుకుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆమె విద్యార్థులతో కలిసి భోజనం చేశారు